క్లుప్తంగా

రేపు తెనాలి పట్టణంలో 2కె రన్

తెనాలిఅర్బన్: స్వీప్ కార్యక్రమంలో భాగంగా ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు శనివారం ఉదయం ఆరు గంటలకు తెనాలి పట్టణంలో 2కె రన్ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఒక ప్రకటనలో తెలిపారు. రజకపేటలోని ఐలమ్మ పార్కు నుంచి చినరావూరు పార్కు వరకు రన్ కొనసాగు తుందన్నారు. తెనాలి పట్టణ పరిధిలోని వివిధ ప్రభుత్వ విభాగాల అధికారులు, యువకులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు పాల్గొనాలని కోరారు.

నేడు పలు గ్రామాల్లో రోడ్డు షో

తెనాలిఅర్బన్: ఎన్నికల ప్రచారంలో భాగంగా వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆధ్వర్యంలో శుక్రవారం సాయంత్రం 4 గంటలకు తెనాలి మండల పరిధిలోని జగ్గడిగుంటపాలెం, పెదరావూరు, మల్లెపాడు గ్రామాల్లో రోడ్డు షో నిర్వహించనున్నట్లు పార్టీ కార్యాలయ వర్గాలు తెలిపాయి. రోడ్డు షోలో ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ పాల్గొంటారని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్, వైస్‌చైర్మన్‌లు, కౌన్సిలర్లు, కో–ఆప్షన్ సభ్యులు, జెడ్పీటీసీలు, ఎంపీపీలు, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, వైఎస్సార్ సీపీ నాయకులు, అభిమానులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

చలివేంద్రాన్ని వినియోగించుకోండి



తెనాలిఅర్బన్: వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని దీనిని అంతా ఉపయోగించుకోవాలని దీప్తి పబ్లికేషన్ అధినేత అడ్డాల ఆంజనేయులు పేర్కొన్నారు. అన్నదాత సుఖీభవ తెనాలివారి ఆధ్వర్యంలో బోసురోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహం వద్ద గురువారం ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. ప్రతి రోజు చల్లటి మంచినీరు, మజ్జిగ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. వేసవికాలం ముగిసేవరకు చలివేంద్రం కొనసాగుతుందని చెప్పారు. కార్యక్రమంలో మొవ్వా సత్యనారాయణ, జీవీ.నారాయణ, చాగంటి చంద్రశేఖర్‌రెడ్డి, కె.శ్రీనివాసరావు, కొఠారి ఛాతన్ రాజ్, వెంకటప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారులతో ఆత్మీయ సమావేశం



తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని కిరాణా మర్చంట్స్ అసోసియేషన్ నాయకులతో బుధవారం రాత్రి వైఎస్సార్ సీపీ తెనాలి నియోజకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ ఆత్మీయ సమావేశాన్ని నిర్వహించారు. వ్యాపారుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుర్రం ఉదయ్‌శంకర్, కార్యదర్శి కొప్పరావూరి కిషోర్, ట్రెజరర్ వక్కలగడ్డ సుబ్రమణ్యం, వైఎస్సార్ సీపీ తెనాలి పట్టణ క్లస్టర్–1 అధ్యక్షుడు మద్దాలి శేషాచలం తదితరులు పాల్గొన్నారు.

విద్యతోనే మహిళల పురోగతి

ఫిరంగిపురం: విద్యద్వారానే మహిళలు ఆర్థికంగా పురోగతి సాధించవచ్చని సెయింట్ ఆన్స్ పాఠశాల హెచ్‌ఎం సిస్టర్ ఒట్టి వసంతకుమారి అన్నారు. మండల కేంద్రంలోని సెయింట్ ఆన్స్ పాఠశాలలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో ఆమె మాట్లాడారు. పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 500 మార్కులు దాటిన తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు 30 మంది ఉన్నారని తెలిపారు. వారిలో డి.కృపారాణి, సుహాన, రమ్యశ్రీనవ్య, సుకన్య, మరియకీర్తి, రఫియా, లక్ష్మీసుకన్య, శ్రావణి, కీర్తన, నమితారెడ్డి, యామిని, అరుణకుమారి, లక్ష్మీ, బ్యూలా, శాంతి, మహాలక్ష్మీదుర్గ, వెళాంగిణిజ్యోతి, పి.శాంతి, ఏంజల్, కరిష్మ, అంజనాదేవి.అనిత, దివ్య, కీర్తనామృత, ప్రసన్నకుమారి, చైతన్య, భార్గవి, రుక్సానా, నోషిన్, త్రివేణిలు ఉన్నారని చెప్పారు. వారిని అభినందించారు.

వసతి గృహంలో సెల్‌ఫోన్లు చోరీ

మంగళగిరి: గుర్తు తెలియని వ్యక్తి వసతి గృహంలోకి ప్రవేశించి సెల్‌ఫోన్లు ఎత్తుకుపోయిన ఘటన గురువారం ఆత్మకూరులో చోటు చేసుకుంది. బాధితులు మంగళగిరి గ్రామీణ పోలీస్ స్టేషన్‌లో ఎస్సై క్రాంతి కుమార్‌కు ఫిర్యాదు చేశారు. బాధితుల వివరాల మేరకు... ఎల్‌బీ నగర్(ఆత్మకూరు) ఏపీఎస్‌పీ బెటాలియన్ సమీపంలోని కొప్పెర్ల పీజీ హాస్టల్‌లో స్థానికంగా వివిధ కళాశాలల్లో చదువులు సాగిస్తున్న విద్యార్థులతో పాటు పలువురు ఉద్యోగులు పేయింగ్ గెస్టులుగా ఉంటున్నారు. గురువారం ఉదయం 6గంటల ప్రాంతంలో గుర్తు తెలియని వ్యక్తి వసతి గృహంలోకి ప్రవేశించి గదుల్లో నిద్రిస్తున్న వారి వద్ద నుంచి 3 సెల్‌ఫోన్లు అపహరించుకుపోయాడు. వసతిగృహం నిర్వాహకులు సీసీ పుటేజీల ద్వారా ఆగంతకుడిని కనుగొని మంగళగిరి రూరల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

వైఎస్సార్ సీపీకి కంచుకోట తెనాలి

- ఐదేళ్ల పాలనలో ప్రతి సామాన్యుడికీ చేరువయ్యాను..
- సీఎం వైఎస్.జగన్‌ను రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకుందాం
- కొండవీటి సేవా సమితి ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలి: సంక్షేమ పాలనతో రాష్ట్రాన్ని దేశానికే ఆదర్శంగా నిలిపిన వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ క్రమంలో కొండవీటి సేవా సమితి తమ వంతుగా పార్టీ గెలుపుకు మద్దతునీయటం అభినందనీయమని వైఎస్సార్ సీపీ తెనాలి అసెంబ్లీ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. స్థానిక 34వ వార్డులోని రామాలయం వీధిలో గల ఆర్ రెసిడెన్సీ ఆవరణలో బుధవారం రాత్రి కొండవీటి సేవాసమితి ఆధ్వర్యంలో ఏర్పాటైన ఆత్మీయ సమావేశంలో ఎమ్మెల్యే శివకుమార్ పాల్గొని మాట్లాడారు. రాష్ట్రంలోని పరిణామాలపై సేవాసమితి బాధ్యులు చైతన్య వంతంగా ఉండటం సంతోషంగా ఉందన్నారు. పోలింగ్ తేదీ వరకు అప్రమత్తంగా ఉండాలని ఏదైనా సమస్య వచ్చినపుడు తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. తెనాలి నియోజకవర్గం వైఎస్సార్ సీపీకి కంచుకోటగా మారిందని చెబుతూ ఎమ్మెల్యేగా తాను ప్రతి సామాన్యుడికి చేరువైనందునే అది సాధ్యపడిందన్నారు. గత ఎన్నికల్లో గెలిచిన దగ్గర్నుంచి ఎవరు ఏ కార్యక్రమానికి ఆహ్వానించినా మన్నించి హాజరయ్యానని గుర్తుచేశారు. వారి కష్ట సుఖాల్లో పాలు పంచుకున్నానని చెప్పారు. నేను ఆహ్వానిస్తే మా ఇంటికి ఎమ్మెల్యే వస్తాడు...అని ప్రతి సామాన్యుడు అనుకునేలా వారికి దగ్గరయ్యానని తెలియజేశారు. ఏ సమస్య వచ్చినా నిస్సంకోచంగా చెప్పుకోగల భరోసాను కల్పించానని అన్నారు. అందుకే నియోజకవర్గం పార్టీకి కంచుకోటగా మారిందన్నారు. గుంటూరు పార్లమెంటు పరిధిలో కేవలం తెనాలి మినహా మిగిలిన అసెంబ్లీ నియోజకవర్గాల్లో అభ్యర్థుల మార్పు ఇందుకు నిదర్శనమన్నారు. దీనికి తోడు ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి తనపై నమ్మకం ఉందన్నారు. పార్టీ కార్యక్రమాల నిర్వహణలో తాను ముందుంటున్న విషయాన్ని ఆయనే స్వయంగా పలు సమావేశాల్లో ప్రస్తావించిన వైనాన్నీ గుర్తు చేశారు. పార్టీని నమ్ముకున్న వారిని సాధ్యమైనంత వరకు కలుపుకు పోతున్నట్టు శివకుమార్ చెప్పారు. రానున్న ఎన్నికల్లో తన గెలుపుతో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని రెండోసారి ముఖ్యమంత్రిగా చేసుకునేలా తోడ్పడాలని విజ్ఞప్తి చేశారు. కొండవీటి సేవాసమితి నాయకులు పేరం సంజీవరెడ్డి, గోపిరెడ్డి శ్రీనివాస రెడ్డి, ఉడుముల చిన్నబాలకోటిరెడ్డి, ఉయ్యూరు సంజీవరెడ్డి మెట్టు శ్రీనివాసరెడ్డి, కామిరెడ్డి చెన్నారెడ్డి పర్యవేక్షించారు. యారవ వెంకటరెడ్డి, భవనం వెంకటరెడ్డి, సేవాసమితి సభ్యులు పాల్గొన్నారు.

మా నాన్నను గెలిపించరూ!



శిరిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న అఖిల్ గణేష్

శిరిపురం(కొల్లిపర): రాష్ట్రంలో సీఎం జగన్‌మోహన్ రెడ్డి అధికారంలో ఉంటేనే కులమతాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాల ఫలాలు అందుతాయని ఈ పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ సీపీకి అధికారం కట్టబెట్టాలని తెనాలి ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ తనయుడు అన్నాబత్తుని అఖిల్ గణేష్ ఓటర్లను కోరారు. గురువారం ఆయన మండల కేంద్రంలోని శిరిపురం గ్రామంలో సర్పంచ్ పచ్చవ సులోచనరాణి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక నాయకులతో కలసి విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను కలిశారు. తన తండ్రి అన్నాబత్తుని శివకుమార్‌ని మరోసారి ఎమ్మెల్యేగా గెలిపించాలని కరపత్రాలతో ఓటర్లను అభ్యర్థించారు. ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి ఎంపీ అభ్యర్థి కిలారి వెంకటరోశయ్యను సైతం గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. తొలుత నాయకులతో కలసి గ్రామంలోని ప్రధాన కూడలిలో ఉన్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు .కార్యక్రమంలో ఎంపీటీసీ కారుమంచి పృధ్వీకుమార్, మాజీ ఎంపీటీసీ పచ్చవ రమేష్‌బాబు, చివలూరు సర్పంచ్ బొంతు వేణుగోపాలరెడ్డి, మొవ్వ జగన్ మోహన్‌రావు, పోపూరి రత్తయ్యచౌదిరి, గోశ ధర్మరావు, అత్తోట ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

మే1 నుంచి ఉచిత వేసవి శిక్షణ శిబిరం

తెనాలి: పట్టణానికి చెందిన కన్నెగంటి రెడ్డమ్మ చౌదరి, అన్నపూర్ణదేవి ఫౌండేషన్ ఏటా నిర్వహిస్తున్న ఉచిత వేసవి శిక్షణ శిబిరం ఈ ఏడాది మే ఒకటో తేదీ నుంచి ఆరంభించనున్నారు. అన్ని వయసుల బాలికలు, స్త్రీలు, 11 ఏళ్లలోపు బాలురకు మాత్రమే ఏర్పాటు చేస్తున్న ఈ శిక్షణ శిబిరం జూన్ 5వ తేదీ వరకు ప్రతిరోజూ ఉదయం 5.30 గంటల్నుంచి 11.30 గంటల వరకు జరుగుతుందని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు కన్నెగంటి రామరాయ చౌదరి ఒక ప్రకటనలో తెలియజేశారు. భారతీయ సంస్కృతి సంప్రదాయాల కొనసాగింపు కోసం ఈ శిబిరంలో యోగ, కూచిపూడి నృత్యం, కర్ణాటక సంగీతం, చిత్రలేఖనం, సంస్కృతం, తెలుగులో శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తిగల వారంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు గ్రాడ్యుయేషన్ డే సంబరాలు

తెనాలి: శ్రీసరస్వతీ శిశుమందిర్ గ్రాడ్యుయేషన్ డే సంబరాలను ఈ నెల 27న నిర్వహిస్తున్నట్టు శిశుమందిర్ సంచాలిత సమితి, పాఠశాల అభివృద్ధి కమిటీ గురువారం ఒక ప్రకటనలో తెలియజేశాయి. ఆరోజు సాయంత్రం 4 గంటలకు తెనాలి రామకృష్ణకవి కళాక్షేత్రంలో ఏర్పాటయ్యే సభకు సంచాలిత సమితి అధ్యక్షుడు డాక్టర్ సామల లక్ష్మణబాబు అధ్యక్షత వహిస్తారు. గౌరవ అధ్యక్షుడు కొత్త సుబ్రహ్మణ్యం, కార్యదర్శి కోడూరు రమాదేవి, ప్రముఖ వైద్యులు డాక్టర్ పాటిబండ్ల దక్షిణామూర్తి, శ్రీసరస్వతీ విద్యాపీఠం–విజయవాడ సమితి కార్యదర్శి కొసనం జగదీష్, పాఠశాల విద్యాకమిటీ అధ్యక్షుడు యర్రంశెట్టి హనుమంతరావు, కార్యదర్శి దూళ్ల నరసింహారావు పాల్గొంటారని వివరించారు.

రూ. 2.50 లక్షల నగదు స్వాధీనం



తాడికొండ: ఎన్నికల ప్రవర్తన నియామావళిలో భాగంగా ఎన్నికల అధికారులు విస్తృతంగా తనిఖీలు నిర్వహిస్తున్నారు. అనధికారికంగా తరలిస్తున్న రూ.2.50 లక్షల నగదును గురువారం స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు. ఫ్లయింగ్ స్క్వాడ్ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తుండగా.. లాం గ్రామం సమీపంలో షేక్ ఫిరోజ్ అనే వ్యక్తి ఎలాంటి రశీదులు లేకుండా కారులో లక్ష రూపాయలు తరలిస్తుండగా స్వాధీనం చేసుకున్నారు. కంతేరు శ్రీసిటీ సమీపంలో తాడికొండ గ్రామానికి చెందిన తాడిబోయిన ప్రసాదు అనే వ్యక్తి ద్విచక్ర వాహనంలో రూ.1.50లక్షల నగదు తరలిస్తూ సరైన రశీదులు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నారు. పంచనామా అనంతరం తాడికొండ పోలీస్ స్టేషన్‌లో అప్పగించారు. తదుపరి విచారణ నిమిత్తం నగదును ఐటీ అధికారులకు అప్పగించనున్నట్లు సీఐ సీహెచ్ ప్రభాకర్ తెలిపారు.

మలేరియా మహమ్మారి నిర్మూలనే లక్ష్యం


మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న



జెండా ఊపి ర్యాలీని ప్రారంభిస్తున్న కమిషనర్ శేషన్న

తెనాలిఅర్బన్: 2030 నాటికి భారతదేశంలో మలేరియాను నిర్మూలించడమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవాన్ని పురస్కరించుకుని మలేరియా తెనాలి సబ్ యూనిట్ ఆధ్వర్యంలో పట్టణంలో అవగాహన ర్యాలీని గురువారం నిర్వహించారు. దీనిని కమిషనర్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మలేరియాను నిర్మూలించడంలో ప్రజా భాగస్వామ్యం ఎంతో అవసరమన్నారు. నీటి నిల్వల్లో దోమలు గ్రుడ్లు పెట్టి తమ సంతతిని పెంచుకుంటున్నాయని వాటివల్లే వ్యాధులు ప్రబలుతున్నాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో బయట నీటి నిల్వలు లేకుండా చూసుకోవాలన్నారు. మురుగు కాల్వల్లో పారుదల సక్రమంగా జరిగితే కొంత వరకు దోమలు నియంత్రించవచ్చన్నారు. దోమల నుంచి రక్షణ పొందేందుకు దోమ తెరలు వాడటం, వస్త్రాలను పూర్తిగా ధరించడం వంటి వాటిని చేయాలన్నారు. ఆరోగ్యాధికారిణి డాక్టర్ కారుమూరి హెలెన్ నిర్మల మాట్లాడుతూ విపరీతమైన జ్వరం, చలి, చమటలు పట్టుట, తలనొప్పి, వికారం మొదలైనవి మలేరియా లక్షణాలని తెలిపారు. అలాంటివి కనిపిస్తే వెంటనే వైద్యశాలను సంప్రదించాలన్నారు. సకాలంలో మలేరియాను గుర్తిస్తే చికిత్స సులువు అన్నారు. సహాయ మలేరియా అధికారి చరసాని ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ 2008లో ప్రపంచ ఆరోగ్య సంస్థ సూచన మేరకు మలేరియా దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యాధికారిణి డాక్టర్ బీబీజాన్, ఆరోగ్య విస్తరణాధికారి అందె బాలచంద్రమౌళి, మలేరియా సబ్ యూనిట్ అధికారి శ్రీకంఠ ఉమాకంత్, డీపీఎం శ్యామ్, తదితరులు పాల్గొన్నారు.

జేఈఈ మెయిన్స్‌లో విద్యార్థుల ప్రతిభ



అత్యధిక పర్సంటైల్ సాధించిన విద్యార్థినులను అభినందిస్తున్న యాజమాన్యం

తెనాలి: జేఈఈ మెయిన్స్‌లో స్థానిక వివేక విద్యా సంస్థల విద్యార్థులు 24 మంది అడ్వాన్స్‌డ్ పరీక్షలకు అర్హత సాధించినట్టు డైరెక్టర్ డాక్టర్ రావిపాటి వీరనారాయణ వెల్లడించారు. వీరిలో అయిదుగురు 90 పర్సంటైల్ పైగా సాధించి కేంద్ర ప్రభుత్వ ఎన్ఐటీల్లో ఇంజినీరింగ్ కోర్సుల్లో అడ్మిషన్లకు అవకాశం పొందినట్టు తెలిపారు. జనవరి, ఏప్రిల్‌లో రెండుసార్లు జరిగిన జేఈఈ మెయిన్స్‌లో తమ విద్యార్థి భార్గవ గతంలోనే 99.4 పర్సంటైల్ సాధించగా, ఈసారి బి.నాగపూజిత 95.3 పర్సంటైల్, జయశ్రీ 93.2, జాహ్నవి 92, యశశ్రీ 90 పర్సంటైల్ సాధించినట్టు వివరించారు. జాతీయ స్థాయి పరీక్షల్లో మంచి పర్సంటైల్ సాధించిన సందర్భంగా విద్యార్థులను గురువారం క్యాంపస్‌లో జరిగిన కార్యక్రమంలో సత్కరించారు. డాక్టర్ వీరనారాయణతో పాటు ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు డాక్టర్ కె.రామరాజు, గుత్తా వెంకటరత్నం, ప్రిన్సిపాల్స్ జ్యోతి, కేవీ బ్రహ్మం, సీఈవోలు ఉదయ్‌కిరణ్, వెంకట్రామ్, డీన్ ఎన్.శ్రీనివాస్, బాబూరావు, అనూరాధ, మురళి, రాంబాబు పాల్గొన్నారు.

ఈఎస్ఐ ఆధ్వర్యంలో మెగా వైద్యశిబిరం



మాట్లాడుతున్న ఈఎస్ఐ అధికారి

తెనాలి: ఈఎస్ఐ విభాగం ఆధ్వర్యంలో గురువారం స్థానిక రామలింగేశ్వరపేటలోని శ్రీచైతన్య జూనియర్ కాలేజీలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. పట్టణంలో గల శ్రీ చైతన్య పాఠశాలలు, శ్రీ చైతన్య జూనియర్ కాలేజీల్లో పని చేస్తున్న ఉద్యోగుల్లో ఈఎస్ఐ చందాదారులు, కుటుంబ సభ్యులకు నిర్వహించిన వైద్య శిబిరంలో బీపీ, షుగర్, థైరాయిడ్, ఈసీజీ వంటి ప్రాథమిక పరీక్షలు చేశారు. అవసరమైన మందులను ఉచితంగా అందజేశారు. డాక్టర్ మాధవి, డాక్టర్ జ్యోతి, డాక్టర్ ప్రేమ్ చంద్, డాక్టర్ ఫణిందర్ వైద్య పరీక్షలు చేశారు. అక్కడే అవగాహన సదస్సును జరిపి ఈఎస్ఐ స్కీము ద్వారా ఉద్యోగులకు, వారి కుటుంబ సభ్యులకు కలిగే ప్రయోజనాలను వివరించారు. వైద్య శిబిరానికి 300 పైగా ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యులు హాజరైనట్టు శ్రీ చైతన్య పట్టణ ప్రిన్సిపాల్స్ బి.తిరుపతిరావు, నన్నపనేని సునీల్‌కుమార్ తెలిపారు. ఈఎస్ఐ సిబ్బంది పర్యవేక్షించారు.

తాగునీటి సరఫరాకు చర్యలు చేపట్టండి

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలోని ప్రజలందరికీ రక్షిత మంచినీరు సక్రమంగా పంపిణీ జరిగేలా చూడాలని మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న ఆదేశించారు. బాలాజీరావుపేటలో గురువారం ఆయన పర్యటించారు. వార్డులో జరుగుతున్న పారిశుద్ధ్య నిర్వహణ పనులు, పైపులైన్ల మరమ్మతులను పరిశీలించి పలు సూచనలు చేశారు. ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా చూడాలన్నారు. ఆయన వెంట పలువురు మున్సిపల్ అధికారులు, సిబ్బంది ఉన్నారు.

పోస్టల్ బ్యాలెట్ వివరాల సేకరణకు నేడు ఆఖరు

నెహ్రూ నగర్: ఎన్నికల విధులలో పాల్గొంటున్న ఉద్యోగులకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకునేందుకు శుక్రవారం చివరి రోజు అని నగర పాలక సంస్థ అదనపు కమిషనర్, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి(ఆర్‌ఓ) కె.రాజ్యలక్ష్మి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికల విధులు కేటాయించబడిన ప్రభుత్వ అధికారులు, సిబ్బంది పోస్టల్ బ్యాలెట్ ని తొలుత ఈ నెల 22వ తేదీలోపు ఇవ్వాలని ఎన్నికల కమిషన్ ఉత్తర్వులు ఇచ్చిందని, ప్రస్తుతం 26వ తేదీ వరకు గడువు పొడిగించిందని తెలిపారు. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం(94) పరిధిలో ఎన్నికల ప్రక్రియలో విధులు నిర్వహిస్తున్న ఉద్యోగులు, ఉద్యోగేతరులు (వీడియోగ్రాఫర్స్, డ్రైవర్లు మొదలుగు వారు) వారి ఓటు ఏ నియోజకవర్గంలో ఉన్నప్పటికి, జీఎంసీలోని ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ వద్ద ఫారం–12 కు సంబంధించిన వివరాలు అందించాలని కోరారు. పోస్టల్ బ్యాలెట్ కోసం ఈ నెల 26వ తేదీ శుక్రవారం లోగా నగరపాలక సంస్థ ప్రధాన కార్యాలయంలో ఎలక్షన్ సెల్‌లో ఏర్పాటు చేసిన పోస్టల్ బ్యాలెట్ హెల్ప్ డెస్క్ లో ఫారం–12(2 కాపీలు) అందించాలని తెలిపారు. ఫారం–12తో పాటు ఓటర్ ఎపిక్ కార్డ్ కాపీ, డ్యూటీ ఆర్డర్ కాపీ తప్పనిసరిగా ఇవ్వాలన్నారు.

వైఎస్సార్ సీపీ గెలుపుకు సహకరించండి



కరపత్రాలు పంపిణీ చేస్తున్న చైర్‌పర్సన్ రాధిక

తెనాలిఅర్బన్: వైఎస్సార్ సీపీని వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఆదరించి ఓట్లు వేయాలని వైఎస్సార్ సీపీ తెనాలి నియోకవర్గ అసెంబ్లీ అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్ సతీమణి పుష్ప, మున్సిపల్ చైర్‌పర్సన్ తాడిబోయిన రాధికలు కోరారు. పట్టణంలోని 11వ వార్డులో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం అందించిన సంక్షేమం, అభివృద్ధిని తెలియజేసి కరపత్రాలు పంపిణీ చేశారు. మే13న జరిగే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు వేయాలని కోరారు. 11వ వార్డులో మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్ శివకుమార్‌కు మద్దతుగా ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించి ఓట్లు అభ్యర్థించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు కఠారి రత్నకుమారి, వైఎస్సార్ సీపీ నాయకులు కఠారి హరీష్, చెరుకూరి సురేష్‌రెడ్డి, చుండూరు వెంకటేశ్వరరావు, చుక్కా ఆనంద్, దేవరపల్లి కిషోర్‌కుమార్, పెద్ద సంఖ్యలో పలువురు వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఓటు వేయడం బాధ్యతగా గుర్తెరగాలి



ప్రతిజ్ఞ చేస్తున్న కమిషనర్ శేషన్న, కుమార్ పంప్స్ అధినేత సుబ్రమణ్యం

తెనాలిఅర్బన్: ఓటు వేయడం ప్రతి ఒక్కరి బాధ్యతని కుమార్ పంప్స్ అధినేత కొత్త సుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ బండి శేషన్న పేర్కొన్నారు. స్వీప్ కార్యక్రమంలో భాగంగా సుల్తానాబాద్‌లోని కుమార్ పంప్స్ ఇండస్ట్రీలో గురువారం ఓటు హక్కుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగం ఓటు హక్కును ప్రతి పౌరుడికి కల్పించిందని తెలిపారు. ఆ హక్కును అందరూ బాధ్యతతో వినియోగించుకోవాలన్నారు. భావి తరాలకు మంచి భవిష్యత్‌ను అందించాలంటే మంచి పాలకులను ఎన్నుకోవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ఓటు వేస్తామని ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ కె అనూషా, ఏసీపీ సుబ్బారావు, కుమార్ పంప్స్ ప్రతినిధులు కొత్త కృష్ణ కుమార్, కొత్త హరి కుమార్, జనరల్ మేనేజర్ వి రాజేంద్రప్రసాద్, జి శేషగిరిరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్‌లు రామచంద్రరావు, వై అనుపమ, కార్మికులు పాల్గొన్నారు.

తెనాలిలో కొత్త సినిమా షూటింగ్



లిటిల్ భాను, ఇతర నటీ నటులపై క్లాప్ ఇస్తున్న గురుబ్రహ్మం

తెనాలి: శ్రీ కృష్ణ ఆర్ట్స్ పతాకంపై పట్టణానికి చెందిన దర్శకుడు కనపర్తి రత్నాకర్ దర్శకత్వంలో ఆరంభించిన నూతన సినిమా షూటింగ్ గురువారంతో తొలి షెడ్యూల్‌ను పూర్తి చేసుకుంది. తెనాలి, పరిసర ప్రాంతాల్లో గత నాలుగు రోజులుగా వివిధ సన్నివేశాలను చిత్రీకరించారు. ఎడ్యుకేషన్, సైన్స్, పురోగతి అనే అంశాలపై ప్రధానంగా సినిమా ఇతివృత్తం ఉంటుందని రత్నాకర్ తెలిపారు. జులై, ఆగస్టు నెలల్లో మరో రెండు షెడ్యూల్స్‌తో చిత్రీకరణ పూర్తవుతుందనీ, పోస్ట్ ప్రొడక్షన్ పనులు అనంతరం నవంబరులో విడుదల చేస్తామన్నారు. కేజీఎఫ్ ఫేమ్ చైల్డ్ సూపర్ స్టార్ లిటిల్ భాను, మాస్టర్ పుష్కర్‌లు ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, బెల్లంకొండ వెంకట్, గోమతి, మధుకర్, వసంత యామిని, రాధ, అలపర్తి వెంకటేశ్వరరావు, గురుబ్రహ్మం, అజయ్ ఇండియన్, లక్ష్మి, తులసి ఇతర పాత్రల్లో నటిస్తున్నారని తెలిపారు. సాధు సుస్మిత, కన్నెగంటి రవి, కె.ధీరజ్‌లు నిర్మాతలు కాగా సినిమాటోగ్రఫీ వరప్రసాద్‌రెడ్డి, ఆర్ట్ వెంకట్, అసోసియేట్ డైరెక్టర్ రమణ, స్టిల్స్ సీహెచ్ శేఖర్, ప్రొడక్షన్ మేనేజర్ మునిపల్లి శ్రీకాంత్‌గా వివరించారు.

వైఎస్సార్ సీపీ జెండా, అజెండా ఒక్కటే



గుడివాడ యాదవపాలెంలో శివకుమార్‌కు గొర్రె పిల్లను బహూకరిస్తున్న స్థానికులు



రోడ్‌షోలో ప్రజలకు అభివాదం చేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి శివకుమార్

- మూడు పేలికలు వేసుకుంటున్న వారు ప్రజలకు ఎలా న్యాయం చేస్తారు..
- గత పదేళ్లలో 10 సార్లు తెనాలి రాని జనసేన నాయకుడికి ఓట్లు అడిగే హక్కు లేదు..
- రోడ్‌షోలో వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి అన్నాబత్తుని శివకుమార్

తెనాలిరూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలోని వైఎస్సార్ సీపీ జెండా, తమ అధినాయకుడి అజెండా ఒక్కటేనని, ఇతర పార్టీలలాగ కూటమి పేరుతో ప్రజలను మభ్యపెట్టే అవసరం తమకు లేదని వైఎస్సార్ సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి, ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మండలంలోని కోపల్లె, గుడివాడ, ఎరుకలపూడి, కఠెవరం గ్రామాల్లో గురువారం సాయంత్రం నుంచి రాత్రి వరకు రోడ్ షో నిర్వహించారు. గ్రామాల్లో అడుగడుగునా ప్రజలు అపూర్వ స్వాగతం పలికారు. కోపల్లె నుంచి సాయంత్రం ప్రారంభమైన రోడ్ షో గుడివాడ, ఎరుకలపూడి, కఠెవరం గ్రామాల్లో రాత్రి వరకూ కొనసాగింది. ఆయా గ్రామాల్లో స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎన్నికల ప్రచార వాహనంపై ఆయన ప్రచారంలో ముందుకు సాగారు. గ్రామంలో ప్రచారానికి వస్తున్న ఎమ్మెల్యే శివకుమార్‌కు ప్రజలు సంపూర్ణ మద్దతు తెలియజేశారు. వారందరికీ అభివాదం చేస్తూ ఆయన రోడ్ షోలో పాల్గొన్నారు. మహిళలు ఆయనకు దిష్టి తీస్తూ అభిమానాన్ని చాటుకున్నారు. అడుగడుగునా మహిళలు హారతులు ఇచ్చి స్వాగతం పలికారు. రోడ్ షోను తిలకించేందుకు బయటకు వచ్చిన ప్రజలతో వీధులన్నీ నిండిపోయాయి. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ తెనాలి జనసేన అభ్యర్థిగా పోటీ చేస్తున్న నాదెండ్ల మనోహర్ మూడు పేలికల జెండానే మెడలో వేసుకుని తిరుగుతున్నాడని, గత పదేళ్లలో 10 సార్లు తెనాలి రాని ఆయన నెల రోజులుగా కుటుంబ సమేతంగా ఇక్కడే ఉంటూ ఓట్ల కోసం తాపత్రయ పడుతన్నారని విమర్శించారు. నిరంతరం ప్రజల్లో ఉంటున్న తమ పార్టీకే ప్రజల మద్దతు తెలుపుతున్నారని చెప్పారు. ఐదేళ్లలో ప్రతి గ్రామంలో మౌలిక వసతులను అభివృద్ధి చేశామని, గ్రామ సచివాలయాలు, ఆర్‌బీకే, వెల్‌నెస్ సెంటర్లు, ఆరోగ్య కేంద్రాల నిర్మాణం ఇందుకు ఉదాహరణగా చెప్పారు. గుడివాడ యాదవపాలెంలో చెన్నుబోయిన శ్రీనివాసరావు, స్థానికులు శివకుమార్‌కు గొర్రెపిల్లను బహుకరించారు. ఈ సందర్భంగా యాదవపాలెం పెద్దలు శివకుమార్‌తో మాట్లాడారు. ఇచ్చిన మాట ప్రకారం యాదవపాలెంలో కమ్యూనిటీ హాలు నిర్మించారని, తమ పాలెం ప్రజలందరి మద్దతు ఇస్తున్నామని ప్రకటించారు. ప్రచారంలో ఎమ్మెల్యేతో పాటు ఎంపీపీ ధర్మరాజుల చెన్నకేశవులు, జెడ్పీటీసీ పిల్లి ఉమాప్రణతి, మండల పార్టీ అధ్యక్షుడు చెన్నుబోయిన శ్రీనివాసరావు, కోపల్లె సర్పంచ్ చింతల కుమారి, ఎంపీటీసీ కారుమంచి కిషోర్‌బాబు, కందుల రాంబాబు, దండమూడి లాజరు, బురదగుంట రమేష్, మరకా రాజేష్, కడియాల శివ, పిల్లా సాల్మన్, పద్మావతి, దేశబోయిన గోపి, దేశబోయిన బుచ్చయ్య, ఎరుకలపూడి మాజీ సర్పంచ్ చందు శాంతికుమార్, కఠెవరం ఎంపీటీసీ మలా భాను, మాజీ సర్పంచ్ గంపల శివనాగేశ్వరరావు, మాజీ ఎంపీటీసీ సంకురు బుజ్జిబాబు, ఆదం షఫి, ఎల్‌బీసీ చిన్ని, తుల్లిమిల్లి సువర్ణబాబు, నారయ్య, ఆయా గ్రామాల వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ అభిమానాన్ని చాటుకున్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
90102 23706 (తెనాలి, వేమూరు, రేపల్లె)
99122 25447 (తెనాలి)
Office mail : sakshigntadvt@gmail.com